క్లుప్తంగా

ఫ్లోరోసిస్ బాధితులకు మందులు పంపిణీ


ఫ్లోరోసిస్ బాధితులకు మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

గడివేముల: కరిమద్దెల గ్రామంలోని ఫ్లోరోసిస్ బాధితులకు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు పాటిస్తే ఫ్లోరోసిస్‌ను నివారించవచ్చునని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్ వైజర్ మనోహర్, ఏఎన్ఎం ఆనందభారతి, ఆశ వర్కర్లు శివ నాగలక్ష్మి, విజయ్ కుమారి, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్

సి.బెళగల్: తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. గురువారం ఉదయం పోలీస్ సిబ్బందితో మండలంలో గస్తీ నిర్వహిస్తుండగా తిమ్మందొడ్డి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించే వారిపై ప్రజలు సమాచారానిన పోలీస్‌లకు ఇవ్వాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వొద్దెలవాగుపై నూతన బ్రిడ్జి


వొద్దెల వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి

పాణ్యం: పాణ్యం–కొణిదేడు గ్రామాల మధ్య వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని వొద్దెల వాగుపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. దాదాపుగా రూ. 2కోట్ల నిధులతో ఈ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం పునాదుల్లో కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. వచ్చే వర్షాకాలానికి పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేశారు.

ఏపీఆర్‌జేసీలో సంగాల విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని ప్రేమవర్షను అభినందిస్తున్న సర్పంచ్ హనుమంతు, గ్రామ పెద్దలు

సి.బెళగల్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజ్ (ఏపీఆర్‌జేసీ) ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనపరిచనట్లు సంగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సునీల్ రాజు తెలిపారు. గురువారం ఆయన వివరాలను వెల్లడిస్తూ, గత నెలలో జరిగిన ఏపీ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ప్రేమవర్ష 150 మార్కులకు గాను 108 మార్కులతో సత్తా చాటిందన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థిని, తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ హనుమంతు, మాజీ సర్పంచ్ గొల్ల హనుమంతు గ్రామస్తులు అభినందించారు.

విధుల్లో చేరిన ఎస్పీ

కర్నూలు: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జపాన్ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో చేరారు.ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు పది రోజుల పాటు ఎస్పీ దంపతులు జపాన్ పర్యటనకు వెళ్లారు. నంద్యాల ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఇన్‌చార్జ్ ఎస్పీగా వ్యవహరించారు. ఈ నెల 17న జిల్లాలో సీఎం పర్యటించనున్న నేపథ్యంలో ఎస్పీ గురువారం విధుల్లో చేరి బిజీబిజీగా గడిపారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై సమీక్షించారు.

కేఎంసీ క్యాంటీన్ వ్యవహారంపై నేడు సమావేశం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల క్యాంటీన్ వ్యవహారంలో నెలకొన్న వివాదంపై ఈనెల 16న వైద్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని హెచ్ఓడీలు, వైద్యులతో కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో అందరి అభిప్రాయాలు తీసుకుని డీఎంఈ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్యాంటీన్ వ్యవహారంపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

అనుమతి లేని వెంచర్లు

- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అక్రమ లే–అవుట్‌లు
- కొన్న తర్వాత లబోదిబోమంటున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు


గార్గేయపురం సర్వే నంబరు 749 లో అసైన్డ్ పట్టా భూముల్లో వేసిన వెంచరు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు నగర శివారులో అక్రమ లే– అవుట్లు వెలుస్తున్నాయి. కొందరు రియల్ వ్యాపారులు యథేచ్ఛగా అనుమతులు లేని వెంచర్లు వేసి ప్రజలకు అంటగడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడటమే కాక కొనుగోలు చేసిన వ్యక్తులు నష్టపోతున్నారు. గ్రామాల్లో పంట పొలాలు అక్రమ వెంచర్లుగా మారిపోతున్నాయి. రియల్టర్లు జేబులు నింపుకొనేందుకు కనీస అనుమతులు కూడా తీసుకోకుండా ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల చేతులు తడిపితే చాలు... ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుట్టగొడుగుల్లా కర్నూలు మండలం పరిధిలో అక్రమ వెంచర్లు వెలుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారులు అనుమతి లేని వెంచర్లను ఆదాయ వనరుగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. మండలంలోని బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, పసుపల, పి.రుద్రవరం, నందనపల్లె, గార్గేయపురం, పడిదెంపాడు, పంచలింగాల, ఇ.తాండ్రపాడు, తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో అనుమతి లేని వెంచర్లు ఉన్నాయి. అనుమతులు తీసుకోకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి వెంచర్లు వేశారు. మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలలను ఆసరా చేసుకుని ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే స్థలాలను అంటగడుతున్నారు. నిబంధనలు పాటించని వెంచర్లలో భూమిని కొనుగోలు వ్యవహారం భవిష్యత్‌లో ఇబ్బందికరంగా మారుతుందని తెలిసినా కొందరు కొనుగోలు చేస్తుడం గమనార్హం.

వాగులు, వంకల్లో ప్లాట్లు..

కొందరు రియల్టర్లు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి యథేచ్ఛగా వెంచర్లు వేస్తున్నారు. వాగులు, వంకలు, డొంకలు, పోరంబోకు భూములు, కాల్వ, చెరువు గట్లను సైతం వదలడం లేదు. కొందరు పంచాయతీ కార్యదర్శులకు విషయం తెలిసినా మామూళ్లతో మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవినీతి అధికారుల అండదండలతో కొందరు రియల్టర్లు అక్రమ వెంచర్లు దర్జాగా వేస్తున్నట్లు తెలుస్తోంది. మండల పరిధిలోని 340 సి బైపాస్ వెంట బి.తాండ్రపాడు, పసుపల, పి.రుద్రవరం, సర్వే నంబరు 608, హెచ్, గార్గేయపురం సర్వేనంబరు 750, 751, 640, 648, 645, నందనపల్లె గ్రామాల్లో అసైన్డ్ పట్టా భూముల్లో వెంచర్లు వెలిశాయి. ఆయా లే– అవుట్‌లలో స్థలాలు క్రయ, విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.


పడిదెంపాడు గ్రామంలో సర్వే నంబరు 91లో అనుమతులు లేని లే–అవుట్

ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే...

వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చాలంటే రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగ్గా తీసుకోవాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల నిమిత్తం వినియోగించుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. అందుకు ప్రభుత్వానికి భూమి విలువలో 2 శాతం వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ సంస్థ పరిధిలో ఉన్న భూమి అయితే ఆ సంస్థతో పాటు స్థానిక పంచాయతీ అనుమతి కూడా తప్పనిసరి. కాని రియల్టర్లు ఖర్చు తగ్గించుకునేందుకు ఇవేవీ పట్టించుకోకుండా అక్రమంగా వెంచర్లు వేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ..

దిన్నెదేవరపాడు గ్రామంలో సర్వే నంబరు 224, 225లో ప్రభుత్వ వాగును అక్రమించి ఇళ్లు నిర్మించగా గ్రామ అధికారులు పట్టించుకోవడం లేదని కొంత మంది జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అక్రమ కట్టడాన్ని జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి కూల్చేశారు. ఇటీవల పడిదెంపాడు, నందన పల్లె గ్రామ పరిధిలో కూడా వాగు స్థలం అక్రమణకు గురయ్యిందని జిల్లా అధికారులకు కొంతమంది ఫిర్యాదు చేశారు. పి.రుద్రవరం గ్రామంలో సర్వే నంబరు 136లో జలవనరుల శాఖకు చెందిన భూమి కూడా ఆక్రమణకు గురైందని గ్రామస్తులు చెబుతున్నారు.

లే –అవుట్ నిబంధనలు ఇలా..

- కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోని కర్నూలు మండలంలో నూతన వెంచర్ నిర్మాణంలో రియల్టర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి.
- వెంచరు వేసేందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి.
- 40 అడుగుల ప్రధాన రోడ్లు ఉండాలి.
- 33 అడుగుల అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలి
- తాగునీరు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీకి 10 శాతం ఖాళీ స్థలం కేటాయించాలి.
- బఫర్ జోన్‌కు దూరంగా ఉండాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అసైన్డ్, చుక్కల భూముల్లో, వాగు, పోరంపోగు, ఇనాం, మాన్యం భూముల్లో ఎవరైనా అక్రమంగా వెంచర్లు వేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ వెంచర్లపై మాకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. కర్నూలు రూరల్ పరిధిలోని కొన్ని గ్రామాలు కుడా పరిధిలో ఉండటంతో కుడా నిబంధనలు పాటిస్తూ లే–అవుట్‌లు వేయాలి. కొనుగోలు దారులు స్థలాలు కొనేముందు వెంచర్ అనుమతులు పరిశీలించుకోవాలి.
– జాకీర్ హుస్సేన్, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

కల్లూరు: ఎన్‌టీఆర్ లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసుకోనేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అధికారులకు సూచించారు. గురువారం కల్లూరు మండలం పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల్లోని లే అవుట్ కాలనీలో హౌసింగ్ పీడీ పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ. 1.80 లక్షలకు అదనంగా రూ. 50 వేలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.ఇంటి నిర్మాణం చేసుకుంటన్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 38 మంది లబ్ధిదారులకు అదనంగా రుణాల మంజూరు లబ్ధికి అర్హులన్నారు. కార్యక్రమంలో ఈఈ వెంకటదాసు, డీఈఈ ప్రభాకర్, ఏఈ శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికపై కుక్కల దాడి

కర్నూలు(రూరల్): నగరంలోని సోమిశెట్టి నగర్‌కు చెందిన దీపిక అనే 11 సంవత్సరాల బాలికపై కుక్కలు దాడి చేశాయి. బాలిక ఎడమ చేయికి గాయమైంది. వీధిలో నడుచుకుంటూ వస్తుండగా కాలనీలోని వేంకటేశ్వరస్వామి అలయం ఎదురుగా ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు బాలికను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సోమిశెట్టి నగర్‌లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మందు బాబూలూ.. మా పొలాల్లోకి రావొద్దు!


కోడుమూరు శివారులోని పొలంలో మందుబాబులు పడేసిన బీరు సీసాలు

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే మద్యం అమ్మకాలకు తలుపులు బార్లా తెరిచింది. దీంతో ఏ మారుమూల పల్లెలో చూసినా మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. ఏ గ్రామంలో చూసినా ఆరు బయట మందుబాబులు పగులు, రాత్రి అన్న తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని పోలీసులు పట్టుకెళ్లి కేసులు పెడుతుండడంతో మందుబాబులు రైతులకు సంబంధించిన పొలాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్యం తాగి అక్కడే సీసాలను పగులగొడుతుండడం, పగిలిన గాజుముక్కలు భూమిలో కలిసిపోయి వ్యవసాయ పనులు చేసే సమయంలో రైతులు, కూలీలకు గుచ్చు కుని తీవ్రగాయాలు చేస్తున్నాయి. పైగా ఎవ్వరైనా రైతు లు తమ పొలాల్లో తాగవద్దని మందుబాబులను చెబి తే ఆ రైతులపై తిట్లదండకాన్ని అందుకుంటున్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ ఎన్నడూ?


కంకర తేలిన రోడ్లు



కల్లూరు: కల్లూరు అర్బన్‌లోని పలు కాలనీలో మట్టి రోడ్లు కనిపిస్తున్నాయి. ఎన్నికల ముందు టీడీపీ నాయకులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు వేస్తామని ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పదకొండు నెలలు అవుతున్న కల్లూరు అర్బన్‌లోని 37, 41, 19, 20, 21వ వార్డుల్లో అక్కడక్కడ మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాకాలం వస్తుండడంతో ఆయా రోడ్లపై ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన చెత్తా చెదారం



ఎక్కడి చెత్త అక్కడే!

కల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి కంపు కొడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ కాలువలో చెత్త చెదారంతో నిండి మురుగు నీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర పేరుతో నెలలో మూడవ శనివారం పారిశుద్ధ్యం పనుల్లో భాగంగా డ్రైనేజీ కాలువలు, చెత్త చెదారం తొలగిస్తున్నామని పైకి చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. తడకనపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని కాలనీ వాసులు మదన్ గోపాల్, రాముడు, చిన్న మద్దిలేటి, పెద్ద ఎల్లయ్య వాపోతున్నారు. మంచినీటి కుళాయిల్లో కలుషితమైన నీరు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు డ్రైనేజీ కాలువలో సొంతంగా చెత్త తొలగించుకుంటున్నామన్నారు. అధికారులు వచ్చిన ప్పుడు మాత్రం హడావుడి చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి ఆ తర్వాత మళ్లీ కనిపించడం లేదన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పోస్టుల భర్తీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్టుల భర్తీ విషయంలో అభ్యంతరాలు రావడంతో దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. 'స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై ఆమె స్పందిస్తూ పోస్టుల భర్తీలో అభ్యంతరాల విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టు విషయంలో పూర్తిస్థాయిలో సర్టిఫి కెట్లు ఒరిజినల్ అని తేలిన తర్వాతనే వారికి వేతనాలు చెల్లిస్తామనే నిబంధనతోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. వారి సర్టిఫికెట్లు నకిలీవని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల మూడు నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇచ్చామన్నారు. అలాగే 33 శాతం ఉమెన్ రిజర్వేషన్, ఎస్టీ రోస్టర్ అంశంలో కూడా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన నూతన గైడ్‌లైన్స్ ప్రకారం పోస్టులు భర్తీ చేశామని, కేవలం రెండు పోస్టులు మాత్రమే ఉన్నందున 33 శాతం రిజర్వేషన్ ఉత్పన్నం కాదన్నారు. పోస్టుల భర్తీ విషయంలో పూర్తిస్థాయిలో మెరిట్ కమ్ రోస్టర్, సర్టిఫికెట్ల ఒరిజినాలిటీ పరిశీలిస్తున్నామన్నారు. ఏవైనా ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

18న డాక్టర్‌నాగేశ్వరరెడ్డికి సన్మానం


డాక్టర్ నాగేశ్వరరెడ్డితో డాక్టర్ శంకరశర్మ, డాక్టర్ మోహన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డిని ఈ నెల 18వ తేదీన కర్నూలులో ఘనంగా సన్మానించనున్నట్లు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. ఈ మేరకు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ డాక్టర్ జి.మోహన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి ఆయన్ను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 18వ తేదీన స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవన్‌లో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఇందులో పేగులఆరోగ్యం గురించి డాక్టర్ నాగేశ్వర రెడ్డి ప్రసంగిస్తారని, అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

బస్టాండ్‌లో సౌకర్యాల కల్పన


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రయాణికులకు కావాల్సిన తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చోవడానికి కుర్చీలు, తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఆర్టీసీ డీపీటీఓ రజియా సుల్తానాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17న పాణ్యంలో నిర్వహించే 'స్వచ్ఛాంధ్రా... స్వర్ణాంధ్రా' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజకుమారి హాజరవుతున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ప్రయాణికులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ బీరేంద్రకుమార్, సచివాలయ సిబ్బంది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి


వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: క్యాన్సర్ మహమ్మారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. గురువారం కోడుమూరు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. నోటిలో ఎరుపు లేదా తెలుపు మచ్చలు మానకుండా ఉండడం, నోరు తెరువడంలో ఇబ్బంది పడడం, రెండు నుంచి మూడు వారాలు మించి స్వరంలో మార్పులు, నోరు, గొంతు, మెడలో గడ్డలుండడం, ఉన్నట్లుండి బరువు పెరగడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్స పొందాలని సూచించారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీమంత్ మాదన్న, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంఘాలపై దాడి అమానుషం

- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న టీజీ వెంకటేష్
- కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): మంత్రి టీజీ భరత్ అండదండలతో టీజీ వెంకటేష్ రెచ్చిపోతున్నారని, ఎవరైనా మాట్లాడితే దాడులు చేయించి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కర్నూలు రూరల్ మండలం గొందిపర్లలో పీటీఎఫ్ఈ ప్లాంటు విస్తరణపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులపై దాడులు, మీడియా నిర్బంధాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. దాడులు జరుగుతున్నా చోద్యం చూసిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమతో పంచలింగాల, గొందిపర్ల, దేవమాడతోపాటు ఆరు లక్షల జనాభా కలిగిన కర్నూలుకు ప్రమాద ఘంటికలు తప్పవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా అధికార, డబ్బు బలంతో టీజీవీ గ్రూపు మొండిగా ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. పరిశ్రమలో వాడే పదార్థాలపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిన బాబురావు అనే సైంటిస్టుపై సీపీఎం ముద్ర వేయడం అన్యాయమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిష్పక్షపాతంగా జరగాలంటే కలెక్టరేట్‌లో నిర్వహించాలని జేసీని కోరినా పట్టించుకోలేదని చెప్పారు. తమకు అనుకూలమైన వారితో టీజీవీ గ్రూపు స్క్రిప్టు చదివించారని ఆరోపించారు. సరైన ప్రజాభిప్రాయ సేకరణ జరగకపోవడానికి ముమ్మాటికీ కలెక్టర్, ఎస్పీలే కారణమని ఆరోపించారు. తక్షణమే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి మరోసారి కలెక్టరేట్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శులు టి.రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కర్నూలు (సిటీ): కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 2017 నుంచి ఇప్పటివరకు జూనియర్ సహాయకుల పోస్టుల కొరకు 87 మంది కారుణ్య నియామకాల కింద దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం జిల్లాపరిషత్‌లో సుమారుగా 30 వరకు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా ఆయా కుటుంబాలు ఉద్యోగం లేక ఆర్థికంగా చిన్నాభిన్నమవుతూ పిల్లల చదువులు, వివాహాలు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, కావున అర్హతలను సడలించి కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలన్నారు. చైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మహమ్మద్ షఫి, గోవింద నాయక్, దేవదాసు, సురేష్, నారాయణ, ఉస్మాన్, సుధీర్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.